బీజేఆర్ నగర్‌లో ఆరు నెలలుగా..

# సా..గని పాఠశాల భవనం పనులు



పిల్లర్లకే పరిమితమైన పాఠశాల భవనం

పిల్లర్ల దశకే పరిమితం

చేతులెత్తేసిన కాంట్రాక్టర్

దూరంగా ఉన్న పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు

బంజారాహిల్స్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పాలకులు మారుతుంటారు.. కానీ సమస్యలు ఎక్కడివి అక్కడే ఉంటాయి అనడానికి ఫిలింనగర్ బీజేఆర్ నగర్ ప్రభుత్వ పాఠశాలే నిదర్శనం. ఐదు సంవత్సరాలుగా స్కూల్ కోసం బస్తీవాసులు పోరాటం చేసినా సొంత భవనం అందని ద్రాక్షగానే మారింది. దీంతో బస్తీకి చెందిన విద్యార్థులు కిలో మీటర్ల దూరంలోని పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్తామంటూ చెప్పే విద్యాశాఖ అధికారులు బీజేఆర్ నగర్ ప్రభుత్వ పాఠశాల విషయంలో మొదటి నుంచి నిర్లక్ష్య ధోరణితోనే వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాము పోరాటం చేసి నిధులు మంజూరు చేయించినా పనులు పిల్లర్లకే పరిమితమయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పాత భవనంలోకి డ్రైనేజీ నీరు**

బీజేఆర్ నగర్‌లోని సుమారు 250 గజాల ప్రభుత్వ స్థలంలో గతంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉండేది. ఇందులో తొమ్మిది గదులు ఉండేవి. సుమారు 300 మంది విద్యార్థులు ఉండేవారు. అయితే, బస్తీలో రోడ్డు ఎత్తు పెరగడంతో చుట్టూ ఉన్న భవనాలు కూడా ఎత్తు పెరిగాయి. దీంతో పాఠశాల భవనం కిందకు అయిపోయింది. చిన్న పాటి వర్షం వచ్చినా స్కూల్ ముంపునకు గురయ్యేది. ఈ వరద నీటిలో నుంచే విద్యార్థులు తరగతి గదిలోకి వెళ్లే వారు. రోజులు గడుస్తున్నా కొద్ది స్కూల్‌లో చేరిన వరదనీరు బయటకు వెళ్లేందుకు దారులు మూసుకుపోయాయి. కొన్ని సందర్భాల్లో మోటార్లు పెట్టి నీరును బయటకు పంపించేవారు. మూడు సంవత్సరాల క్రితం భారీగా పడిన వర్షాలకు స్కూల్ భవనంలో నడుము లోతు నీరు నిలిచింది. విద్యార్థులు వెళ్లలేని దుస్థితి నెలకొంది. దీంతో అప్పటికప్పుడు విద్యాశాఖ అధికారులు ఇక్కడ చదువుతున్న విద్యార్థులను చుట్టూ ఉన్న బస్తీల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. భవనానికి మరమ్మతులు చేయించేందుకు ప్రయత్నించారు. కానీ, వరదనీటికి డ్రైనేజీ నీరు కూడ తోడు కావడంతో పాఠశాల కాస్త మురికి కూపంగా మారింది. అధికారులు కూడా వదిలేశారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో కొంత మంది పాఠశాల భవనాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించగా, స్థానికులు అడ్డుకున్నారు. ఇదే విషయాన్ని పాలకులు, ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇలా, ఆరు నెలలపాటు విద్యాశాఖ చుట్టూ తిరగగా చివరకు అధికారులు స్పందించారు.

**రూ.32 లక్షల నిధులు మంజూరు**

విద్యాశాఖ అధికారులు స్థలాన్ని రక్షించేందుకు నడుం బిగించారు. సర్వశిక్ష అభియాన్ కింద రూ.32 లక్షల నిధులను కొత్త భవన నిర్మాణం కోసం మంజూరు చేశారు. బుల్‌డోజర్‌తో పాత భవనాన్ని కూల్చివేశారు. భూమి చదును చేసి పిల్లర్లను తీశారు. ఆ తర్వాత గుత్తేదారు చేతులెత్తేశాడు. ఎవరికి ఏం చెప్పకుండా పనులు మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయాడు. ఇప్పుడు పాఠశాల పిల్లర్లకు పరిమితమైంది. అంతేగాకుండా భూమికి కాస్త ఎత్తులో నిర్మించాలని అధికారులు సూచించగా, గుత్తేదారు మాత్రం పాత భవనం ఉన్నట్టే లోపలికి పిల్లర్ల నిర్మాణం చేపట్టాడు. రెండు నెలల క్రితం పడిన వర్షానికి నీరు నిలిచినట్టు స్థానికులు చెబుతున్నారు. ఇదే విషయాన్ని విద్యాశాఖ అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లారు. పాఠశాల భవనం కూడా త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు ఇంత వరకూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇదిలా ఉండగా, జూబ్లీహిల్స్ నియోజక వర్గం కిందకు వచ్చే ఈ బస్తీలోకి ఉప ఎన్నిక ప్రచారం కోసం నాయకులు వచ్చినప్పుడు స్థానికులు పాఠశాల నిర్మిస్తామంటే ఓట్లు వేస్తామని చెప్పారు. అందరూ పాఠశాల కడతామని హామీ ఇచ్చారు తప్పితే ఎన్నికలు పూర్తయ్యాక అటు వైపు తలెత్తి చూడలేదు.




గతంలో వరద నీరు చేరిన పాఠశాల భవనం (ఫైల్)

**అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు**

● ఫైవ్ ఫింగర్స్ ప్రతినిధులు

నిరుపేదలు ఉండే బీజేఆర్ నగర్ ప్రభుత్వ పాఠశాల విషయంలో విద్యాశాఖ అధికారులు ఉద్దేశ్యపూర్వకంగానే మొదటి నుంచి నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారు. నాలుగు సంవత్సరాలుగా కొత్త భవనం కోసం తమ సంస్థ పోరాటం చేస్తున్నా పట్టించుకోలేదు. పాత భవనం కూల్చేందుకు సుమారు మూడు సంవత్సరాల సమయం తీసుకున్నారు. విద్యాశాఖ చుట్టూ తిరగగా నిధులు మంజూరు చేశారు. ఇప్పుడు ఆరు నెలలుగా పనులు ఆగిపోయాయి. యేడాదిలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన అధికారులు పాఠశాలను ఎప్పుడు స్థానికులకు అందుబాటులోకి తీసుకువస్తారో అర్థం కావడం లేదు.



అమీర్‌పేటలో జిస్మత్ జైల్ మండిని ప్రారంభిస్తున్న నటుడు ధర్మ మహేష్

## అమీర్‌పేటలో జిస్మత్ జైల్ మండి రెస్టారెంట్ ప్రారంభం

అమీర్‌పేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేటలోని మాంగళ్య షాపింగ్ మాల్ పైన జిస్మత్ జైల్ మండి రెస్టారెంట్‌ను నటుడు, జిస్మత్ అధినేత ధర్మ మహేష్ తన కుమారుడు జగద్వాజ పుట్టిన రోజు సందర్భంగా ప్రారంభించారు. ఈ మండి భోజన ప్రియులకు వైవిధ్యమైన రుచుల ద్వారా మనోహరాన్ని అందించనుంది. మండి అంటే జిస్మత్ ఎప్పుడూ భోజన ప్రియులకు మొదటిస్థానంగా ఉండేలా మెనూలో కొత్తదనం అందించనుంది. ఇందులో చికెన్, మటన్, చేపలు, శాఖహారం, మాంసాహారంతో మంచి రుచులు అందుబాటులోకి తెచ్చారు. కార్యక్రమంలో ఉత్తమ అవార్డు గ్రహీత సింధూరం తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

## ఆదర్శంగా సీనియర్ సిటిజన్స్ : తలసాని

బేగంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వయస్సుతో పని లేకుండా సమాజ సేవ చేస్తూ సీనియర్ సిటిజన్స్ ఆదర్శంగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం బీకే గూడలోని సీనియర్ సిటిజన్స్ భవన్‌లో జరిగిన సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 80 సంవత్సరాలు పైబడిన 34 మంది, 70 సంవత్సరాలు పైబడిన 32 మంది సీనియర్ సిటిజన్స్‌ను సన్మానించి మెమోంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబసభ్యులతో గడపాల్సిన సమయంలో సమాజ సేవ చేయాలనే సంకల్పం రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శేషకుమారి, బీఆర్ఎస్ సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, సీనియర్ సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షుడు దూబే, మాజీ అధ్యక్షుడు పార్థసారథి, మాణిక్‌రావు పాటిల్, సభ్యులు అనంతరెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలికి కేర్‌లో అరుదైన సర్జరీ

హైదరాబాద్ సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పిత్తాశయం చిట్లిపోయిన, అనేక వ్యాధులున్న వృద్ధురాలికి అధిక రిస్క్‌తో కూడిన లాపరోస్కోపిక్ పిత్తాశయ శస్త్రచికిత్సను కేర్ ఆస్పత్రి వైద్యులు విజయవంతగా నిర్వహించారు. సర్జరీ వివరాలను సోమవారం కేర్ ఆస్పత్రి వైద్యులు వెల్లడించారు. నల్గొండకు చెందిన 72 ఏళ్ల వృద్ధురాలు అస్వస్థత కారణంగా స్థానిక ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోగా పిత్తాశయం చిట్లి, తీవ్రమైన కాలిక్యులస్ కోలిసిస్టిటిస్ ఉన్నట్టు గుర్తించారు. ఆమెను ఇటీవల మలకపేటలోని కేర్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ రోబోటిక్ సర్జరీ విభాగం సీనియర్ కన్సల్టెంట్ హెడ్ డాక్టర్ భూపతి రాజేంద్రప్రసాద్ నేతృత్వంలోని బృందం లాపరోస్కోపిక్ అథెసియోలిసిస్, కోలిసిస్టెక్టమీతో పాటు పూర్తి పెరిటోనియల్ వాష్ ప్రక్రియను నిర్వహించింది. శస్త్రచికిత్స వల్ల తీవ్రమైన సెప్సిస్, అవయవాల పనితీరు దెబ్బతినే ప్రమాదం తప్పిపోయిందని డాక్టర్ రాజేంద్రప్రసాద్, మలకపేట కేర్ ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ ఎడ్లా వివరించారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వృద్ధ రోగుల్లో ఇటువంటి కేసులను లాపరోస్కోపిక్‌గా చేయడం చాలా అరుదని, రోగి కోలుకోవడంతో డిశ్చార్జి చేసినట్లు వారు తెలిపారు.



ఎక్సైజ్ సిబ్బందితో మాట్లాడుతున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

## మత్తు పదార్థాలపై అవగాహన పెంచాలి

● మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

హైదరాబాద్ సిటీ/బంజారాహిల్స్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాల బారిన పడకుండా వారిలో అవగాహన పెంచాల్సిన అవసరం ప్రతీ ఒక్కరిపై ఉందని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. నగరాన్ని డ్రగ్స్ ఫ్రీ సిటీగా మార్చాలని ఆమె పిలుపునిచ్చారు. అమీర్‌పేట్ ఎక్సైజ్ స్టేషన్‌లో కొత్తగా ఏర్పడిన బంజారాహిల్స్ స్టేషన్‌ను సోమవారం ఆమె ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అనిల్ కుమార్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాల్సిన యువత డ్రగ్స్ బారిన పడి తమ జీవితాలను అంధకారం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్సైజ్ శాఖ మత్తు పదార్థాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఎస్ పంచాక్షరి, ఏఈఎస్ శ్రీనివాసరావు, సీఐ బానోత్ పటేల్ పాల్గొన్నారు.



క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులో పరీక్షలు చేస్తున్న వైద్యులు

## ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు

బంజారాహిల్స్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌పై అవగాహన కల్పించడం, వ్యాధిని ముందస్తుగా గుర్తించడం కోసం బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.14 నందినగర్‌లో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మొబైల్ స్క్రీనింగ్ యూనిట్ ఎక్స్-రే, అల్ట్రాసౌండ్, మామోగ్రఫీ యూనిట్లతో పరీక్షలు చేశారు. మహిళా వైద్యులు రొమ్ము పరీక్ష చేసి స్వీయ రొమ్ము పరీక్ష ఎలా చేయాలో నేర్పించారు. 25 ఏళ్లలో ఇప్పటి వరకు ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో 1,500 శిబిరాలను నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మణ్, డా.సిమ్రాన్, డా.రేణుక, గైనిక్ డా.ప్రవళిక, డా.జ్యోతి, డా.పవన్ కుమార్‌రెడ్డి, శ్రీరామ్‌నగర్ షౌకత్‌నగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి అయేషాబేగం తదితరులు పాల్గొన్నారు.

## యాంటీ కరప్షన్ కమిటీ పేరుతో దోపిడీ

● వ్యక్తులపై కేసు నమోదు




యాంటీ కరప్షన్ కమిటీ పేరుతో ఉన్న ఇన్నోవా

అల్వాల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): యాంటీ కరప్షన్ కమిటీ పేరుతో దోపిడీ, బలవంతపు వసూళ్లకు పాల్పడే ఒక ముఠాపై అల్వాల్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజిబుల్ పోలిసింగ్‌లో భాగంగా బొల్లారం-కొంపల్లికి వెళ్లే మార్గంలో రాత్రి 9 గంటల సమయంలో అల్వాల్ ఎస్ఐ తరుణ్‌రెడ్డి మరో ఇద్దరు కానిస్టేబుళ్లతో తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా ఒక ఇన్నోవా వాహనం ముందు భాగంలో రెడ్ కలర్‌తో యాంటీ కరప్షన్ కమిటీ అని రాసి ఉంది. దీంతో పోలీసులు వాహనాన్ని ఆపి ప్రశ్నించడంతో డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి కారులో యాంటీ కరప్షన్ ఆఫీసర్ ఉన్నారని తెలిపారు. ఎంత మంది ఉన్నారని ప్రశ్నించడంతో బి.తిరుమలరావు, రెగల్లా సందీప్, సందీప్‌కుమార్ చావలి, గొల్లా రామమూర్తి, శ్రీకాంత్ ఉన్నారని తెలిపారు. వారి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో ఎస్ఐ విచారించగా జీఆర్ శ్రీకాంత్ సికింద్రాబాద్ డివిజన్ యాంటీ కరప్షన్ కమిటీ ఇన్‌చార్జీగా పనిచేస్తున్నారని వివరించారు. వారికి డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించగా ఆఫీసర్ అని చెప్పిన వ్యక్తి మద్యం తాగి ఉన్నారు. వివరాలను ఉన్నతాధికారులకు చెప్పడానికి ఎస్ఐ తరుణ్‌రెడ్డి వెళ్లడంతో వారు కారును అక్కడే వదిలి పారిపోయారు. పోలీసులు ఇన్నోవా కారు(ఏపీ 09 బీఎల్ 0033)ను పోలీస్‌స్టేషన్ తీసుకవచ్చి అందులో ఉన్న ఐడీ కార్డులను పరిశీలించగా యాంటీ కరప్షన్ కమిటీ అనే విభాగం ఎక్కడా లేదని వెల్లడైంది. తప్పుడు ఐడీ కార్డులను సృష్టించడం, ప్రభుత్వ అధికారిగా నమ్మించి పోలీసులు, అధికారులను మోసం చేయడంతో పోలీసులు సదరు వ్యక్తులపై సోమవారం కేసు నమోదు చేశారు. సదరు వ్యక్తులు యాంటీ కరప్షన్ కమిటీ పేరుతో దోపిడీ, బలవంతపు వసూళ్లకు పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వారిని పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే నవీన్ యాదవ్



కోదండరాంకు ధన్యవాదాలు చెబుతున్న ఎమ్మెల్యే నవీన్ యాదవ్

## పీజేఆర్‌ను తలపించేలా ప్రజా సేవ చేయాలి

● నవీన్ యాదవ్‌కు సూచించిన కోదండరాం

యూసుఫ్‌గూడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా పీజేఆర్‌ను తలపించేలా అన్నివర్గాలకు ప్రజా సేవ చేయాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌కు సూచించారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేసిన టీజేఎస్ నాయకులు, కార్యకర్తలను రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్యే సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో టీజేఎస్ నగర అధ్యక్షుడు ఎం.నర్సయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**గవర్నర్‌ను కలిసిన నవీన్ యాదవ్**

ఎమ్మెల్యే నవీన్ యాదవ్ రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మని మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన వెంట బీసీ జేఏసీ చైర్మన్ చిన్న శ్రీశైలం యాదవ్, రమేష్ యాదవ్, వాసు, దీపక్, చక్రి ఉన్నారు.

## రోడ్లను ఆక్రమించి భవన నిర్మాణ సామగ్రి వ్యాపారం

● అపార్ట్‌మెంట్ వాసుల ఫిర్యాదుతో రంగంలోకి హైడ్రా

బంజారాహిల్స్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్లను ఆక్రమించి భవన నిర్మాణ సామగ్రి వ్యాపారం చేస్తున్న వారిపై హైడ్రా ఆగ్రహం వ్యక్తం చేసింది. వ్యాపారులను అక్కడి నుంచి పంపించి సామగ్రిని తొలగించి ఫుట్‌పాత్‌లను అపార్ట్‌మెంట్ వాసులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఎల్లారెడ్డిగూడ వాసవి సాలిటేర్ అపార్ట్‌మెంట్ చుట్టూ ఉన్న ఫుట్‌పాత్‌లను ఆక్రమించి కొందరు భవన నిర్మాణ సామగ్రి వ్యాపారం చేస్తున్నారు. సామగ్రిని రోడ్డు మీద వేయడంతో పాటు అర్ధరాత్రి సమయంలో అపార్ట్‌మెంట్ వాసులకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరించడం మొదలు పెట్టారు. దీంతో అపార్ట్‌మెంట్ వాసులు గతంలో హైడ్రా దృష్టికి తీసుకువెళ్లగా, అప్పట్లో అధికారులు పరిశీలించారు. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో ఎటువంటి చర్యలు తీసుకోలేదు. వ్యాపారుల ఆగడాలు పెరిగిపోవడంతో సోమవారం హైడ్రా సిబ్బంది పోలీసు బందోబస్తు మధ్య సామగ్రిని తొలగించడం ప్రారంభించింది. ఫుట్‌పాత్‌లపై వెలిసిన సామగ్రిని తొలగించి పాదచారులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. వ్యాపారులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు నియంత్రించారు.



రోడ్డును ఆక్రమించిన భవన నిర్మాణాల సామగ్రిని తొలగిస్తున్న హైడ్రా సిబ్బంది



రాష్ట్రపతి నిలయంలో ఫుడ్ కోర్ట్‌లో వివిధ రాష్ట్రాలకు సంబంధించిన వంటకాలను రుచి చూస్తున్న సందర్శకులు



రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించిన వివిధ పాఠశాలల విద్యార్థులు

రాష్ట్రపతి నిలయంలో...

## ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కళావైభవం

**మూడో రోజు 9000 మంది సందర్శకులు హాజరు**

అల్వాల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో నిర్వహిస్తున్న భారతీయ కళా మహోత్సవ్ రెండో ఎడిషన్‌లో భాగంగా నిర్వహిస్తున్న పశ్చిమ రాష్ట్రాల విభిన్న సాంస్కృతిక, కళాత్మక వారసత్వ మహోత్సవ వేడుకల్లో మూడో రోజు సోమవారం వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఉత్సవాల్లో భాగంగా గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్, గోవా, దాద్రా నగర్, హవేలీ, డామన్ డయ్యూలకు చెందిన కళాకారుల నృత్యాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఆయా రాష్ట్రాలకు చెందిన ప్రసిద్ధిగాంచిన వంటకాలను ఫుడ్ స్టాల్స్‌లో విక్రయించారు. సోమవారం 9000 మంది సందర్శకులు రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించి కళామహోత్సవ్ వేడుకలను తిలకించారు.

## బీసీలను దగా చేసేందుకే జీవో 46 : వేముల

బర్కత్‌పుర, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీలను దగా చేసేందుకే జీవో 46 తీసుకువచ్చిందని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆరోపించారు. హైకోర్టు తీర్పు వెలువడకముందే సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హడావుడిగా ఎన్నికలు నిర్వహించేందుకు జీవో తీసుకువచ్చిందని, దీనిని బీసీలు ఎట్టిపరిస్థితుల్లో సహించరని హెచ్చరించారు. సోమవారం జీవో 46కు వ్యతిరేకంగా కాచిగూడ డివిజన్‌లో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్లను 22శాతానికి తగ్గించి బీసీలను బొందపెట్టడానికే జీవో 46 తీసుకువచ్చిందన్నారు. 42శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేయకపోతే బీసీల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.

సీఎం రేవంత్‌రెడ్డికి బీసీలపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టేవిధంగా కేంద్రంపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. జీవో 46పై కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. జీవోను రద్దు చేయాలని ఇప్పటికైనా ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ శాంతారామ్ గోల్డ్ మెడల్ ప్రదానం చేస్తున్న శాంతారామ్ తదితరులు

## ప్రొఫెసర్ శాంతారామ్ గోల్డ్ మెడల్ ప్రదానం

నిమ్స్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ ఆస్పత్రి జనరల్ మెడిసిన్ విభాగంలో విధులు నిర్వహించి రిటైరైన ప్రొఫెసర్ శాంతారామ్ పేరుతో నిమ్స్ యాజమాన్యం అందిస్తున్న గోల్డ్ మెడల్స్ కార్యక్రమం కొనసాగుతోంది. ఆయన 2023లో నిమ్స్ ఆస్పత్రి నుంచి రిటైర్ అయ్యారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో తొలి గోల్డ్ మెడల్ డాక్టర్ సౌమ్యకు అందజేయగా, రెండో మెడల్ డాక్టర్ సాయివిశాల్‌కు సోమవారం నిమ్స్‌లో జరిగిన కార్యక్రమంలో శాంతారామ్ అందజేశారు. కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ విభాగాధిపతి ప్రొఫెసర్ సుబ్బలక్ష్మి, ప్రొఫెసర్లు నావల్ చంద్ర, వైఎస్ఎన్ రాజు, నాగేశ్వరరావు, మల్లిఖార్జున శెట్టి, డాక్టర్ గంగాధర్, డాక్టర్ శ్రీ భూషణ్ రాజు, డాక్టర్ సదాశివుడు పాల్గొన్నారు.

## 27 నుంచి తెలంగాణ బ్యాడ్మింటన్ టోర్నమెంట్-2025

వెంగళరావునగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ సంక్షేమ సమితి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి మూడు రోజుల పాటు తెలంగాణ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్-2025 జరగనుంది. మధురానగర్ కాలనీలోని డీసీహెచ్ఎస్ఎన్‌రాజు ఇండోర్ స్టేడియంలో అండర్-15 బాయిస్, గర్ల్స్ సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాలలో పోటీలు నిర్వహిస్తున్నామని సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ప్రతాప్‌రెడ్డి, కోడె సాంబశివరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.



చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ రాశి



ఆస్పత్రిలో ఉమ(హోంగార్డు)

## రోడ్డు ప్రమాదంలో మహిళా పోలీసులకు గాయాలు

ఖైరతాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ధర్నా సందర్భంగా బందోబస్తు కోసం వచ్చిన మహిళా పోలీసులకు రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. సైఫాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సైఫాబాద్ పాఠశాల విద్యాశాఖ కార్యాలయం వద్ద నిరసన కార్యక్ర మం జరగగా చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌కు చెందిన మహిళా కానిస్టేబుళ్లు బందోబస్తు విధులకు వచ్చారు. బందోబస్తు ముగిసిన అనంతరం రోడ్డు దాటుతుండగా టెలిఫోన్ భవన్ నుంచి వస్తున్న ఉబర్ ట్యాక్సీ కారు(టిజి 07టి 6977) వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కానిస్టేబుల్ రాశికి, హోంగార్డు ఉమకు గాయాలవడంతో ఆస్పత్రికి తరలించారు. కారును, డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే

సికింద్రాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్‌ను సోమవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైనందుకు బొకేతో శుభాకాంక్షలు తెలిపారు. సికింద్రాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేయడానికి, ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి పనులను అన్ని వర్గాల ప్రజలకు వివరించడానికి తాను ఎల్లప్పుడూ ముందుంటానని శ్రీగణేష్ తెలిపారు. ఏ ఎన్నికలు వచ్చినా సికింద్రాబాద్ జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో హస్తం పార్టీ పతాకాన్ని రెపరెపలాడిద్దామని అన్నారు.

## గ్యార్మీ ఉత్సవం



న్యూబోయినపల్లి ఖడక్‌పురాలోని సయ్యద్ మిస్కిన్ ఖాద్రి దర్గా గ్యార్మీ ఉత్సవం సోమవారం ఘనంగా జరిగింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ చాదర్ సమర్పించి ప్రార్థనలు జరిపారు. చోటు, ఆరిఫ్, సిరాజ్, షకీబ్ హుస్సేన్, అహ్మద్, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు. - బోయినపల్లి, ఆంధ్రజ్యోతి



గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాణికి జ్ఞాపికను అందజేస్తున్న ఐపీఓఎస్ అధికారిణి అనన్యప్రియ

## వైద్యులు పోస్టల్ సేవలు వినియోగించుకోవాలి

● సూపరింటెండెంట్ డాక్టర్ వాణి

అడ్డగుట్ట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గాంధీ ఆస్పత్రిలోని వైద్యులు పోస్టల్ సేవలను వినియోగించుకోవాలని సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్(ఐపీఓఎస్) అధికారిణి అనన్య ప్రియ తెలిపారు. సోమవారం గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్‌వాణిని కలిసి పోస్టల్‌శాఖ అందిస్తున్న ఖాతాలు, లైఫ్ ఇన్సూరెన్స్, సుకన్య సమృద్ధి యోజన తదితర సేవలను వివరించారు. సుకన్య సమృద్ధి యోజన పథకంపై అవగాహన కలిగించేందుకు ప్రసూతీ విభాగం వద్ద ప్రతినిధులను నియమించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గాంధీ ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ శేషాద్రి, పోస్టల్ శాఖ ప్రతినిధులు పబ్లిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ నారాయణ, పవన్ కుమార్‌లు పాల్గొన్నారు.



ప్రపంచ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై రోగులకు అవగాహన కల్పిస్తున్న గాంధీ ఆస్పత్రి వైద్యులు

## గాంధీ ఆస్పత్రిలో రోగులకు అవగాహన

అడ్డగుట్ట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గాంధీ ఆస్పత్రిలోని ఓపీ విభాగం వద్ద సోమవారం రోగులకు ప్రపంచ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ ముగింపు వారోత్సవాల సందర్భంగా వైద్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణి, గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిర, ఆర్ఎంఓలు డాక్టర్ రజిని, యుగేందర్, నవీన్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సాదియా సుల్తానా, డాక్టర్ బ్రహ్మేశ్వర్, ఫర్హీన్‌బాను, ప్రొఫెసర్ ఉజ్మాతజీన్, ఇఫ్షానా జబీన్, రజిత, పూజ, భవిష్య, విభాగాధిపతులు, వైద్యులు పాల్గొన్నారు.

## అంత్యక్రియల్లో పాల్గొన్న ప్రముఖులు



పాడె మోస్తున్న మందకృష్ణ మాదిగ, గజ్జల నాగేష్ తదితరులు

మారేడుపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ డిబి దేవేందర్ కుమారుడు శరత్ 23న గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వివిధ పార్టీల నేతలు, ప్రముఖులు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, వెన్నెల గద్దర్, కేంద్ర మాజీమంత్రి సర్వే సత్యనారాయణ, విజయా రెడ్డి, మన్నె క్రిశాంక్‌తో పాటు మార్కెట్ అధికారులు, కమిటీ ప్రతినిధులు, వ్యాపారులు శరత్ పార్థీవ దేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సోమవారం మారేడుపల్లి హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

## అమ్మకానికి సిద్ధంగా స్వెటర్లు



చలి తీవ్రత ఉన్న నేపథ్యంలో స్వెటర్స్‌కు డిమాండ్ పెరిగింది. తిరుమలగిరి నుంచి లోతుకుంట వరకు ఫుట్‌పాత్‌లపై వివిధ రకాలైన స్వెటర్లను అమ్మకందారులు విక్రయిస్తున్నారు. సుమారు ఆరువందల నుంచి వేలాది రూపాయల వరకు స్వెటర్స్ అందుబాటులో ఉన్నాయి.
- తిరుమలగిరి, ఆంధ్రజ్యోతి

## బీసీలను దగా చేయడానికే జీవో 46

● బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ

బర్కత్‌పుర, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం బీసీలను దగా చేయడానికే జీవో 46 తీసుకువచ్చిందని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆరోపించారు. హైకోర్టు తీర్పు వెలువడకముందే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హడావుడిగా ఎన్నికలు నిర్వహించడానికి జీవో తీసుకువచ్చిందని, దీనిని బీసీలు ఎట్టిపరిస్థితుల్లో సహించరని హెచ్చరించారు. సోమవారం జీవో 46కు వ్యతిరేకంగా కాచిగూడ డివిజన్‌లో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 42శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేయకపోతే బీసీల తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డికి బీసీలపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టేవిధంగా కేంద్రంపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. జీవో 46పై కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. జీవోను రద్దు చేయాలని ఇప్పటికైనా ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి



అడ్డగుట్ట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్‌లో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన జరిగింది. గోపాలపురం పోలీస్ స్టేషన్ ఎస్సై శివరాజ్ తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఔట్ గేటు వద్ద గుర్తుతెలియని 55 ఏళ్ల వ్యక్తి చనిపోయి ఉండడంతో సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### మురికికూపంగా..

# తిరుమలగిరి చెరువు



తిరుమలగిరి చెరువు

● దుర్గంధ వాసనతో ఉక్కిరిబిక్కిరి
● పట్టించుకోని అధికారులు
● సుందరీకరించాలని స్థానికుల డిమాండ్



తిరుమలగిరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు తాగునీటితో కళకళలాడిన తిరుమలగిరి చెరువు ప్రస్తుతం మురికికూపంగా మారింది. సాయంత్రం అయితే చాలు ముక్కుపుటలు అదిరే దుర్గంధ వాసన వెదజల్లడంతో స్థానికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీంతోపాటు దోమలు వృద్ధి చెంది ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈ సమస్య నుంచి తమను రక్షించాలంటూ ఎన్నో ఏళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్నా స్పందన కరువైంది. కొద్ది నెలల క్రితం దీనిపై స్పందించిన అధికారులు కొంతమేర రింగ్ సీవర్ పనులను ప్రారంభించి పూర్తి చేశారు. అయినా కొన్ని పరిసర ప్రాంతాల నుంచి చెరువులోకి మురుగు ప్రవహించడంతో స్థానికంగా ఇంకా దుర్గంధం వెదజల్లుతూనే ఉంది.

### కబ్జాకు యత్నం

అదేవిధంగా కొందరు వ్యక్తులు చెరువులో మట్టి పోసి కబ్జాకు యత్నిస్తున్నారు. కబ్జాకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి కేసులు నమోదు చేయాలని, చెరువును కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

### సుందరీకరణ చేపట్టాలని డిమాండ్

చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, మొక్కలను ఏర్పాటు చేయడానికి గతంలో హెచ్‌ఎండీఏ అధికారులు చెరువు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఇప్పటివరకు అధికారులు పనులు చేపట్టకపోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కంటోన్మెంట్ బోర్డు అధికారులు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ సమర్పించినా పనులు ఎందుకు సాగడం లేదని కాలనీవాసులు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### ప్రక్షాళన పనులు చేపట్టాలి



చెరువులోకి మురుగు రాకుండా అధికారులు చేపట్టిన పనులు సంతోషకరం. కానీ ఇప్పటికీ కూడా ఫుట్‌బాల్ గ్రౌండ్ పరిసర ప్రాంతాల నుంచి మురుగు చెరువులోకి వచ్చే ప్రమాదం ఉంది. వాటిని కూడా అరికడితే బాగుంటుంది. తొందరగా చెరువు ప్రక్షాళన పనులు చేపట్టాలి.

- సతీష్, మలాని కాలనీ

### అధికారులు కృషి చేయాలి



చెరువు చుట్టూ సుందరీకరణ పనులు చేపట్టి వాకింగ్ చేసుకోవడానికి వీలుగా వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలి. చెరువు చుట్టూ మొక్కలు, చెట్లను నాటాలి. ఓపెన్ జిమ్ కూడా ఏర్పాటు చేయాలి. ఆరోగ్యమైన సమాజానికి నిర్మించడానికి అధికారులు కృషి చేయాలి.

- దర్జీ రాకేష్, మలాని కాలనీ



రాష్ట్రపతి నిలయంలో ఫుడ్ కోర్ట్‌లో వివిధ రాష్ట్రాలకు సంబంధించిన వంటకాలను రుచి చూస్తున్న సందర్శకులు



రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించిన వివిధ పాఠశాలల విద్యార్థులు

### రాష్ట్రపతి నిలయంలో...

## ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కళావైభవం

**మూడో రోజు 9000 మంది సందర్శకులు హాజరు**

అల్వాల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో నిర్వహిస్తున్న భారతీయ కళామహోత్సవ్ రెండో ఎడిషన్‌లో భాగంగా నిర్వహిస్తున్న పశ్చిమ రాష్ట్రాల విభిన్న సాంస్కృతిక, కళాత్మక వారసత్వ మహోత్సవ వేడుకల్లో మూడో రోజు సోమవారం వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఉత్సవాల్లో భాగంగా గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్, గోవా, దాద్రా నగర్, హవేలీ, డామన్ డయ్యూలకు చెందిన కళాకారుల నృత్యాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఆయా రాష్ట్రాలకు చెందిన ప్రసిద్ధిగాంచిన వంటకాలను ఫుడ్ స్టాల్స్‌లో విక్రయించారు. సోమవారం 9000 మంది సందర్శకులు రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించి కళామహోత్సవ్ వేడుకలను తిలకించారు.

## బస్తీల్లో సదుపాయాల మెరుగుకు కృషి: శ్రీగణేశ్



బస్తీల్లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న శ్రీగణేశ్

సికింద్రాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): బస్తీల్లో మౌలిక సదుపాయాల మెరుగుకు కృషి చేస్తున్నట్టు సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేశ్ తెలిపారు. కంటోన్మెంట్ రెండో వార్డులోని రసూల్‌పురా శివాలయం వీధి, గన్‌బజార్ కమ్యూనిటీ హాల్ ఏరియా, ఇలాహీ మజీద్ ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీల అభివృద్ధి ధ్యేయంగా కంటోన్మెంట్‌లోని అన్ని బస్తీల్లో పర్యటిస్తున్నట్టు చెప్పారు. బస్తీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా కంటోన్మెంట్‌లోని బస్తీలకు దుర్గతి పట్టిందని, అవసరమైన బస్తీలకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కంటోన్మెంట్ సమగ్రాభివృద్ధికి ఎన్ని నిధులైనా కేటాయించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని, అందుకే ఈ ప్రజా ప్రభుత్వంలో బస్తీలను అభివృద్ధి చేసుకుందామని శ్రీగణేష్ పిలుపునిచ్చారు. కాగా ఆయా ప్రాంతాల్లో తాగునీరు, విద్యుత్, పారిశుధ్య సమస్యలను గుర్తించిన ఆయన సంబంధిత అధికారులకు ఫోన్ చేసి, వాటిని పరిష్కరించాలని ఆదేశించారు.

### హోలీ ఫ్యామిలీ చర్చి ఆధ్వర్యంలో స్పోర్ట్స్ మీట్

తిరుమలగిరి నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): హోలీ ఫ్యామిలీ చర్చి సభ్యులు, వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలోని క్యాథలిక్ చర్చి సభ్యులకు ఫుట్‌బాల్, వాలీబాల్, క్రికెట్, బాస్కెట్‌బాల్, స్నూకర్, క్యారెమ్స్, బాడ్మింటన్, పవర్‌లిఫ్టింగ్, అథ్లెటిక్స్ విభాగాల్లో జూబ్లీ స్పోర్ట్స్ మీట్ 2025 నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీగణేశ్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చర్చి ఆధ్వర్యంలో ఇలాంటి క్రీడా పోటీలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించిన వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మర్రెడ్డి, జాన్ బాస్కో, శాంసన్, సూర్యకాంత్, అమిత్ అంథొని, జాక్సన్, డెంజిల్, అగస్టిన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన కమిటీ నియామకం

అడ్డగుట్ట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అడ్డగుట్టలోని బాబు జగ్జీవన్ రాం కమ్యూనిటి హాలులో సోమవారం అరుంధతి సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడు వంగపల్లి పరుశురాం, ప్రధాన కార్యదర్శి ఇరుగుబాబు, సలహాదారుడు పసులాది యాదగిరి, జి. చంద్రయ్య, జీ.మల్లేష్, కట్టి ఎల్లయ్య, సాయిలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు గడ్డం మల్లేష్, మంచాల గౌతం కుమార్, ఎర్ర సిద్దులు, సతీష్, శ్రీశైలం, బాలరాజ్, మొగులయ్య, సంచురాజు, శ్రీకాంత్, పవన్, రమేష్, నరేందర్, దేవేందర్, దేవదాస్, దశరథ్, రజినిలు పాల్గొన్నారు.

## వృద్ధురాలికి కేర్‌లో అరుదైన సర్జరీ



కేర్ ఆస్పత్రి వైద్యులు వృద్ధురాలికి సర్జరీ చేసినప్పటి దృశ్యం

హైదరాబాద్ సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పిత్తాశయం చిట్లిపోయిన, అనేక వ్యాధులున్న వృద్ధురాలికి అధిక రిస్క్‌తో కూడిన లాపరోస్కోపిక్ పిత్తాశయ శస్త్రచికిత్సను కేర్ ఆస్పత్రి వైద్యులు విజయవంతగా నిర్వహించారు. సర్జరీ వివరాలను సోమవారం కేర్ ఆస్పత్రి వైద్యులు వెల్లడించారు. నల్గొండకు చెందిన 72 ఏళ్ల వృద్ధురాలు అస్వస్థత కారణంగా స్థానిక ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోగా పిత్తాశయం చిట్లి, తీవ్రమైన కాలిక్యులస్ కోలిసిస్టిటిస్ ఉన్నట్టు గుర్తించారు. ఆమెను ఇటీవల మలక్‌పేటలోని కేర్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ రోబోటిక్ సర్జరీ విభాగం సీనియర్ కన్సల్టెంట్ హెడ్ డాక్టర్ భూపతి రాజేంద్ర ప్రసాద్ నేతృత్వంలోని బృందం లాపరోస్కోపిక్ అథెసియోలిసిస్, కోలిసిస్టెక్టమీతో పాటు పూర్తి పెరిటోనియల్ వాష్ ప్రక్రియను నిర్వహించింది. శస్త్రచికిత్స వల్ల తీవ్రమైన సెప్సిస్, అవయవాల పనితీరు దెబ్బతినే ప్రమాదం తప్పిపోయిందని డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, మలక్‌పేట కేర్ ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ ఎడ్లా వివరించారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వృద్ధ రోగుల్లో ఇటువంటి కేసులను లాపరోస్కోపిక్‌గా చేయడం చాలా అరుదని, రోగి కోలుకోవడంతో డిశ్చార్జి చేసినట్లు వారు తెలిపారు.

## నా భర్తను సైదాబాద్ ఎస్సై నిర్బంధించారు

● డీసీపీ కార్యాలయంలో బాధితురాలు ఫిర్యాదు

సైదాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇంజాపూర్‌కు సంబంధించిన సివిల్ వివాదంలో జోక్యం చేసుకున్న సైదాబాద్ ఎస్సై తన భర్తను అక్రమంగా పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించి రాజీ చేసుకోమని బెదిరించారని సోమవారం సైదాబాద్‌లోని డీసీపీ కార్యాలయంలో అదనపు డీసీపీ శ్రీకాంత్‌కు అంగోతు జయశ్రీ ఫిర్యాదు చేశారు. అనంతరం బాధితురాలు మీడియాతో మాట్లాడారు. ఇంజాపూర్‌లో తన భర్త అంగోతు సురేష్‌తో కలిసి నివాసం ఉంటున్నామని తెలిపారు. అదే ప్రాంతానికి చెందిన బంధువుకు సంబంధించిన ఫైనాన్స్ వివాదంలో సురేష్ మధ్యవర్తిగా ఉన్నారని ఆమె తెలిపారు. శనివారం మధ్యాహ్నం భార్యాభర్తలం కలిసి బైక్‌పై వెళ్తుండగా ఇంజాపూర్ కమాన్ వద్ద బైకు, కారులలో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు తమని అడ్డుకుని సురేష్‌పై దాడి చేసి బలవంతంగా కారులో ఎక్కించుకుని పారిపోయారని తెలిపారు. తాను వెంటనే వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు విచారించి సైదాబాద్ పోలీసులు తీసుకువెళ్లారని తెలిపారని ఆమె పేర్కొన్నారు. తన భర్త సురేష్‌పై సైదాబాద్ పీఎస్‌లో ఎలాంటి ఫిర్యాదు, కేసు కానీ లేదని ఆమె తెలిపారు. అయినా సైదాబాద్ ఎస్సై సాయికృష్ణ తన భర్తను అక్రమంగా తీసుకువచ్చి సైదాబాద్ పీఎస్‌లో నిర్బంధించి బెదిరించాడని ఆరోపించారు. తామంతా పీఎస్‌కు వెళ్లి అడిగితే శనివారం రాత్రి వదిలేశారని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ ఘటనపై పోలీస్ ఉన్నతాధికారులు విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని బాధితురాలు కోరారు.

## యాంటీ కరప్షన్ కమిటీ పేరుతో దోపిడీ

● వ్యక్తులపై కేసు నమోదు



అల్వాల్ పోలీసులు పట్టుకున్న యాంటీ కరప్షన్ కమిటీ పేరుతో ఉన్న ఇన్నోవా

అల్వాల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): యాంటీ కరప్షన్ కమిటీ పేరుతో దోపిడీ, బలవంతపు వసూళ్లకు పాల్పడే ఒక ముఠాపై అల్వాల్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా పోలీసులు బొల్లారం-కొంపల్లికి వెళ్లే మార్గంలో రాత్రి 9 గంటల సమయంలో అల్వాల్ ఎస్ఐ తరుణ్‌రెడ్డి మరో ఇద్దరు కానిస్టేబుళ్లతో తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా ఒక ఇన్నోవా వాహనం ముందు భాగంలో రెడ్ కలర్‌తో యాంటీ కరప్షన్ కమిటీ అని రాసి ఉంది. దీంతో పోలీసులు వాహనాన్ని ఆపి ప్రశ్నించడంతో డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి కారులో యాంటీ కరప్షన్ ఆఫీసర్ ఉన్నారని తెలిపారు. ఎంతమంది ఉన్నారని ప్రశ్నించడంతో బి.తిరుమలరావు, రెగల్లా సందీప్, సందీప్‌కుమార్ చావలి, గొల్లా రామమూర్తి, శ్రీకాంత్ ఉన్నారని తెలిపారు. వారి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటంతో ఎస్ఐ తరుణ్‌రెడ్డి విచారించగా జీ.ఆర్. శ్రీకాంత్ సికింద్రాబాద్ డివిజన్ యాంటీ కరప్షన్ కమిటీ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారని వివరించారు. వారికి డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించగా ఆఫీసర్ అని చెప్పిన వ్యక్తి మద్యం తాగి ఉన్నారు. వివరాలను ఉన్నతాధికారులకు చెప్పడానికి ఎస్ఐ తరుణ్‌రెడ్డి వెళ్లడంతో వారు కారును అక్కడే వదిలి పారిపోయారు. పోలీసులు ఏపీ 09 బీఎల్ 0033 ఇన్నోవా కారు వాహనాన్ని పోలీస్‌స్టేషన్ తీసుకవచ్చి అందులో ఉన్న ఐడీ కార్డులను పరిశీలించగా యాంటీ కరప్షన్ కమిటీ అనే విభాగం ఎక్కడ లేదని వెల్లడైంది. తప్పుడు ఐడీ కార్డులను సృష్టించడం, ప్రభుత్వ అధికారిగా నమ్మించి పోలీసులు అధికారులను మోసం చేయడంతో పోలీసులు సదరు వ్యక్తులపై సోమవారం కేసు నమోదు చేశారు. సదరు వ్యక్తులు యాంటీ కరప్షన్ కమిటీ పేరుతో దోపిడి, బలవంతపు వసూళ్లకు పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వారిని పట్టుకోవడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

## మత్తు పదార్థాలపై అవగాహన పెంచాలి

● మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాల బారిన పడకుండా వారిలో అవగాహన పెంచాల్సిన అవసరం ప్రతీ ఒక్కరిపై ఉందని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. అమీర్‌పేట్ ఎక్సైజ్ స్టేషన్‌లో కొత్తగా ఏర్పడిన బంజారాహిల్స్ స్టేషన్‌ను సోమవారం ఆమె ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అనిల్ కుమార్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాల్సిన యువత డ్రగ్స్ బారిన పడి తమ జీవితాలను అంధకారం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్సైజ్ శాఖ మత్తు పదార్థాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఎస్ పంచాక్షరి, ఏఈ ఎస్ శ్రీనివాసరావు, సీఐ బానోత్ పటేల్ పాల్గొన్నారు.



ఎక్సైజ్ శాఖ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి